సాక్షి
రంగారెడ్డి
గురువారం । 2 । ఫిబ్రవరి । 2023



క్రిమినల్ కేసులు

ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు చూస్తే సహించేది లేదని ఇబ్రహీంపట్నం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు గౌర కృష్ణ, పుష్పలత హెచ్చరించారు. 17లో▸



చిన్నారిని చితకబాదిన టీచర్

హోం వర్కు చేయలేదనే కారణంతో 2వ తరగతి విద్యార్థినిని ఓ ఉపాధ్యాయురాలు వాతలు వచ్చేలా చితకబాదింది. 17లో▸

ఓయూ పీహెచ్‌డీ అడ్మిషన్స్ షెడ్యూల్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ అడ్మిషన్స్ షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారు. ఎంట్రన్స్ టెస్ట్‌లో అర్హత మార్కులు సాధించిన అభ్యర్థులు ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఇంటర్వ్యూలకు అర్హత గల అభ్యర్థుల జాబితాను 25న ప్రకటిస్తామని పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు.

న్యూస్‌రీల్

మహేశ్వరం ఏసీపీగా అంజయ్య బాధ్యతల స్వీకరణ



పహాడీషరీఫ్: మహేశ్వరం డివిజన్ తొలి ఏ సీపీగా సి.అంజయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏసీపీ కార్యాలయానికి పక్కా భవనం నిర్మించకపోవడంతో.. తాత్కాలికంగా పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యాలయం నుంచి బాధ్యతలను పర్యవేక్షించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని మహేశ్వరం, కందుకూరు, పహాడీషరీఫ్, బాలాపూర్ పీఎస్‌ల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

నేడు ఎల్‌బీ స్టేడియంలో క్రికెట్ టోర్నీ ప్రారంభం

నాంపల్లి: ఆలిండియా కేసీఆర్ సేవాదళం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినం (ఫిబ్రవరి 17న) వేడుకలను పురస్కరించుకుని హైదరాబాదులోని ఎల్‌బీ స్టేడియంలో గురువారం మధ్యాహ్నం 1.30 గంటలకు క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం అవుతుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ ఫిబ్రవరి 16వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. గురువారం ప్రారంభమయ్యే టోర్నమెంట్‌ను పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతిగా రూ. లక్ష, రెండో బహుమతిగా రూ. 50 వేల షీల్డ్‌తో పాటుగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగే క్రికెట్ టోర్నమెంట్‌కు పలు రాష్ట్రాలు, జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవుతున్నట్లు తెలిపారు.

రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగించే రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఎల్‌హెచ్‌బీ (లింక్ హాఫ్‌మెన్ బుష్) కోచ్‌లను ప్రవేశపెట్టనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సి.హెచ్.రాకేశ్ తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్- గూడూర్ (12710/12709) సింహపురి ఎక్స్‌ప్రెస్‌కు, సికింద్రాబాద్-ముంబయి (17058/17057) దేవగిరి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 13, 14వ తేదీల నుంచి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ రైళ్లలో రెండు సాధారణ బోగీలు, 9 స్లీపర్ క్లాస్, 3 థర్డ్ ఏసీ బోగీలు, 2 సెకండ్ ఏసీ, మరొక ఏసీకార్ ఉంటాయి.

ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోండి

పరిగి: ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలను వినియోగించుకోవాలని పరిగి డిపోకు చెందిన లాజిస్టిక్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ విశ్వనాథ్ గౌడ్ తెలిపారు. బుధవారం కర్ణాటక రాష్ట్రం యాద్గిర్ బస్‌స్టేషన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలను తాండూరు, వికారాబాద్ డిపోలకు చెందిన లాజిస్టిక్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ మెంబర్లు చంద్రయ్య, వసంత్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. కర్ణాటక రాష్ట్రం యాద్గిర్ పట్టణం నుంచి హైదరాబాద్ నగరానికి అనేక మంది ప్రయాణిస్తుంటారని అన్నారు. నగరానికి ఎగుమతులు, దిగుమతులు చేసుకునే వ్యాపారస్తులు ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. తాము అన్ని విధాలా సౌకర్యాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు.

రిక్తహస్తం!



సాక్షి, రంగారెడ్డి జిల్లా: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ కొన్ని వర్గాలకు ఊరట కల్పించినప్పటికీ.. మరికొన్ని వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసింది. ప్రతిష్టాత్మక పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సహా యాచారం ఫార్మాసిటీ, మెట్రో విస్తరణ, ఐటీఐఆర్, స్మార్ట్‌సిటీ వంటి ప్రాజెక్టుల ప్రస్తావన లేకపోవడం జిల్లా వాసులకు నిరాశ కలిగించింది. టీవీ, సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, కెమెరా కొనుగోలుదారులు, వేతన జీవులు, తలసేమియా బాధితులు, తృణధాన్యాలు పండించే రైతులు, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుదారులకు ఈ బడ్జెట్ కొంత ఊరట కల్పించినప్పటికీ బంగారం, సిగరెట్ కొనుగోలుదారులపై మరింత భారం మోపింది.

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాపై శీతకన్ను

- పాలమూరు- రంగారెడ్డిపై చిన్నచూపు
- ఫార్మాసిటీ, మెట్రో విస్తరణకు పైసా విదిల్చని వైనం
- నిర్మలమ్మ పద్దుపై అధికార పార్టీ నేతల పెదవి విరుపు
- ప్రజారంజక బడ్జెట్ అని బీజేపీ నేతల కితాబు

విద్య, వైద్యాన్ని విస్మరించారు



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఎప్పటిలాగే మొండి చేయి చూపారు. విద్య, వైద్య రంగాలను పూర్తిగా విస్మరించారు. విభజన చట్టంలో భాగంగా రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయాన్ని పట్టించుకోలేదు. విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తేనే 0.5 శాతం ఎఫ్‌ఆర్‌బీఎం అనుమతిస్తామని షరతుపెట్టి, వ్యవసాయ బోర్లకు మీటర్లు పెట్టాలని పరోక్షంగా చెప్పారు. నిరుపేదల కడుపు నింపే ఉపాధి హామీ పథకం నిధుల్లో కోత విధించడం దుర్మార్గం.

– సబితారెడ్డి, విద్యాశాఖ మంత్రి

అంచనాలు తలకిందులు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా వాసుల అంచనాలను తలకిందులు చేసింది. జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టుల ప్రస్తావన లేకపోవడం దారుణం. ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక బడ్జెట్. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి, తగిన నిధులు కేటాయించాలని అనేకసార్లు విజ్ఞప్తి చేశాం. మెట్రో రైలు రెండో దశ ప్రస్తావన కూడా తేకపోవడం విచారకరం. రంగారెడ్డి, చేవెళ్ల, వికారాబాద్ జిల్లాల ప్రజలకు తీరని అన్యాయం చేసింది. ఇంట్లో ఏ చిన్న శుభకార్యమైనా బంగారం తప్పని సరి. బంగారంపై కూడా భారీగా పన్నులు విధిస్తుండటం బాధాకరం.

– రంజిత్‌రెడ్డి, ఎంపీ, చేవెళ్ల

రైతులకు మేలు చేసే బడ్జెట్



ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యంగా ఉంది. రూ.7 లక్షల వరకు ఆదాయ పన్ను తొలగింపు, రైతులకు రూ.20 లక్షల కోట్ల కేటాయింపు, తృణధాన్యాల కేంద్రం, వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రత్యేక నిధులు, సేంద్రియ సేద్యం, ప్రత్యామ్నాయ ఎరువులు తదితర అంశాలతో కూడిన బడ్జెట్ రైతులకు మేలు చేసేలా ఉంది. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ లక్ష్యంగా ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉంది.

– బొక్కా నర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

గణాంకాల గందరగోళం



కేంద్ర బడ్జెట్‌లో గణాంకాల గందరగోళం మినహా ఏమీ లేదు. ప్రజలను విస్మరించి, పెట్టుబడిదారులకు ఊతమిచ్చేలా ఉంది. ధరల నియంత్రణ, వ్యవసాయ రంగం అభివృద్ధి, నిరుద్యోగ సమస్య పరిష్కారం, దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంపై ఎలాంటి చర్యలు కనిపించలేదు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదు. బయ్యారం ఉక్కు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, పాలమూరు- రంగారెడ్డికి నిధులు కేటాయించకపోవడం అన్యాయం.

– మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు



తరగతి గదిలో ఏర్పాటు చేసిన బల్లపై కూర్చుని నాణ్యతను పరిశీలిస్తున్న మంత్రి, సీఎస్

కేసీఆర్ మానస పుత్రిక 'మన బడి'

- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి
- రాచలూరు పాఠశాలలో డిజిటల్ తరగతుల ప్రారంభం
- హాజరైన సీఎస్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి

కందుకూరు: 'మన ఊరు- మన బడి' కార్యక్రమం సీఎం కేసీఆర్ ఆలోచనల్లో నుంచి పుట్టిన మానస పుత్రిక అని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని రాచలూరు ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన పనులను సీఎస్ శాంతకుమారి, జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి వాకాటి కరుణ, విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన తదితరులతో కలిసి బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రూ.7,300 కోట్ల ఖర్చుతో 26 వేల పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. మొదటి విడతలో రూ.3,500 కోట్లతో 9 వేల స్కూళ్లలో వసతులు కల్పించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు 600 పాఠశాలలను ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉచిత బోధన అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచంలో ఎవరితోనైనా పోటీ పడేలా తీర్చిదిద్దుతామని స్పష్టంచేశారు. గురుకులాల్లో సీట్ల కోసం పోటీ పడుతున్నారని, రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు రూ.20 లక్షల ఖర్చు చేస్తున్నామని, గురుకులాల్లో ఒక్కో విద్యార్థిపై రూ.1.05 లక్షల ఖర్చు చేస్తున్నామని, ఇదంతా సీఎం కేసీఆర్ ఘనతేనని కొనియాడారు. అనంతరం డిజిటల్ తరగతి గదులు, డ్యుయెల్ డెస్క్‌లను ప్రారంభించారు.

తల్లిదండ్రులు భాగస్వాములు కావాలి

రాష్ట్ర ముఖ్యకార్యదర్శి శాంతకుమారి మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఉండేవి కావని, ప్రస్తుత ప్రభుత్వం అన్ని హంగులతో పాఠశాలలను తీర్చిదిద్దుతుందన్నారు. తల్లిదండ్రులు భాగస్వాములై, పాఠశాలల బలోపేతంలో క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అమయ్‌కుమార్, అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, డీఈఓ సుశీందర్ రావు, ఆర్డీఓ సూరజ్‌కుమార్, ఎంపీపీ మందజ్యోతి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, స్థానిక సర్పంచ్ శ్రీనివాస్‌చారి, ఎంపీటీసీ బాల్‌రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, ఎస్ఎంసీ చైర్మన్ శోభారాణి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పన్నులు తగ్గించాలి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: కార్పొరేషన్‌లో పన్నుల తగ్గింపుపై పాలకవర్గం తీర్మానం చేయకపోతే ప్రజలతో కలిసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మీర్‌పేటలోని పార్టీ జిల్లా ఆఫీసులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంటి పన్నులను తగ్గించేందుకు సమీక్ష నిర్వహించాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు ఇవ్వడం శుభ పరిణామమన్నారు. ఈ అంశాన్ని కౌన్సిల్‌లో పెట్టి వెంటనే తీర్మానం చేయించాలని డిమాండ్ చేశారు. ఇంటి పన్నుల విషయంలో అధికారుల వద్ద సరైన సమాధానం లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. గత సెప్టెంబరు 9న మీర్‌పేట పాలకవర్గం కౌన్సిల్ సమావేశం జరిగిందని, 90 రోజులకు ఒకసారి మీటింగ్ నిర్వహించాల్సి ఉండగా, 150 రోజులు పూర్తయినా ఏర్పాటు చేయలేదని, ఇలాగైతే ప్రజల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. ఇంటి పన్నులతో పాటు నల్లా బిల్లులు కూడా తగ్గిస్తామని మున్సిపల్ ఎన్నికలకు ముందు ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. 15 మంది కార్పొరేటర్లు ఉన్న బీజేపీ కూడా ఏనాడూ అధిక పన్నులపై కౌన్సిల్‌లో ప్రశ్నించలేదని, అధికార పార్టీతో బీజేపీ కుమ్మక్కైందని ఆయన ఆరోపించారు. నెల రోజుల్లో పన్నుల తగ్గింపుపై తీర్మానం చేయకపోతే మార్చి 2న ఆందోళన, రిలే నిరాహార దీక్షలు చేపడుతామని స్పష్టంచేశారు. సమావేశంలో నాయకులు చల్లా బాల్‌రెడ్డి, ఎరుకల వెంకటేశ్, సాయి, కిశోర్ పాల్గొన్నారు.

ఆహ్లాదానికి అడ్డా

జిల్లాలోని పలు జలాశయాలు ఆహ్లాదానికి కేరాఫ్‌గా మారాయి. చెరువుల సుందరీకరణలో భాగంగా చేపట్టిన పార్కుల నిర్మాణం వీటికి కొత్త కళను తీసుకువచ్చింది. పొద్దంతా తమ పనుల్లో బిజీగా గడుపుతున్న నగరవాసులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడకు చేరుకుని ప్రశాంతంగా సేదతీరుతున్నారు. వాకింగ్ ట్రాక్‌లు, మినీ జిమ్‌లను సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్య భాగ్యాన్నీ పొందుతున్నారు.

- పచ్చని పార్కులతో కనువిందు చేస్తున్న జలాశయాలు
- నయనానందం కలిగిస్తున్న పూల మొక్కలు
- ఆరోగ్యాన్ని పంచే ఆట వస్తువులు
- రూ.32.65 కోట్లతో గండిపేట పార్కు అభివృద్ధి
- మినీ ట్యాంక్ బండ్‌గా మాసబ్ చెరువు



చందన చెరువు కట్టపై ఎల్‌ఈడీ విద్యుత్ దీప కాంతులు, బెంచీలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: గ్రేటర్ ప్రజలు, శివారు మండలాల నుంచి నిత్యం నగరానికి వచ్చిపోయే ప్రయాణికులకు పలు చెరువులు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఉస్మాన్‌సాగర్ కట్టపై గండిపేట వద్ద అందమైన పార్కును డెవలప్ చేయగా.. నాగార్జునసాగర్ రోడ్డులోని తుర్కయంజాల్ మాసబ్ చెరువుతో పాటు మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లోని గొలుసుకట్టు చెరువులను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. వీటితో పాటు ఇబ్రహీంపట్నం, రావిర్యాల చెరువులను కూడా సుందరీకరించి, పర్యాటకులకు కనువిందు చేయాలని ప్రభుత్వం, హెచ్ఎండీఏ భావిస్తోంది.

గండిపేట సిగలో మణిహారం

ఉస్మాన్‌సాగర్‌కు ఆనుకుని ఉన్న గండిపేటలోని ఐదెకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన పార్కు మణికొండ సిగలో పచ్చలహారంలా మారి పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. రూ.32.65 కోట్లతో దీన్ని అభివృద్ధి చేశారు. పిల్లలు ఆడుకునే ఆట వస్తువులతో పాటు రకరకాల పూల మొక్కలతో అద్భుతంగా తీర్చిదిద్దారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కు రద్దీగా ఉంటోంది. ఇదే ప్రాంతంలో మరో 18 ఎకరాల్లో పార్కును ఏర్పాటు చేస్తామని మంత్రి కేటీఆర్ ఇటీవల ప్రకటించారు.

కనువిందు చేస్తున్న మాసబ్ చెరువు

నాగార్జునసాగర్ వైపు వెళ్లే జాతీయ రహదారిపై తుర్కయంజాల్ సమీపంలోని 499 ఎకరాల్లో మాసబ్ చెరువు ఉంది. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో రూ.2 కోట్లతో ఇక్కడ పార్కు, వాకింగ్ ట్రాక్, కుర్చీలు, బుద్ధ విగ్రహం, పూల మొక్కలు, పచ్చిక బయళ్లను ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానికులతో పాటు అటు వైపుగా వచ్చి వెళ్లే ప్రయాణికులు సేద తీరుతున్నారు. శని, ఆదివారాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. సుమారు కిలోమీటర్ దూరం వరకు విస్తరించి ఉన్న చెరువు కట్టపై అభివృద్ధి చేసిన పార్కు ఎంతగానో ఆకట్టుకుంటోంది.

వడివడిగా పెద్ద చెరువు పనులు

మీర్‌పేట్, బడంగ్‌పేట్ మధ్య 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పెద్ద చెరువు సుందరీకరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే రూ.7.35 కోట్ల అంచనా వ్యయంతో పనులు మొదలు పెట్టారు. కట్ట పటిష్టత, కట్ట లోపలి వైపు కాంక్రీట్ పనులు, వాకింగ్ ట్రాక్ పనులు సాగుతున్నాయి. చెరువు చుట్టూ మట్టికట్టను ఏర్పాటు చేశారు. వంద అడుగుల కట్ట విస్తరణ పనులతో పాటు నాలుగు వరుసల రహదారి ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్, వాకింగ్ ట్రాక్, హైమాస్ట్ లైట్లు, ఓపెన్ జిమ్, పిల్లల పార్కును ఏర్పాటు చేస్తున్నారు.

మినీట్యాంక్ బండ్‌గా

మందమల్లమ్మ చౌరస్తా నుంచి బాలాపూర్ వెళ్లే మార్గంలో ఉండే చెందన చెరువు 28 ఎకరాల్లో విస్తరించి ఉంది. రూ.4.16 కోట్లతో వాకింగ్ ట్రాక్, బతుకమ్మ ఘాట్, తెలంగాణ తల్లి విగ్రహం, బుద్ధ విగ్రహం, ఫ్లోటింగ్ గార్డెన్, జింకలు, పక్షుల బొమ్మలు, కట్ట రహదారిపై టైల్స్, ఫుట్ పాత్ గ్రిల్స్, ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఒక వైపు మహాత్మాగాంధీ విగ్రహం, మరోవైపు చాకలి ఐలమ్మ ప్రతిమ, స్తూపం, 75 అడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వచ్చే వాకర్స్‌తో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. మహేశ్వరం నియోజకవర్గంలో మరో ట్యాంక్ బండ్‌లా కనిపిస్తోంది.

మంత్రాల చెరువు

ఆర్సీఐ రహదారి పక్కనే 37 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మంత్రాల చెరువు పర్యాటకులను మంత్రముగ్దులను చేస్తోంది. రూ.2.20 కోట్ల అంచనా వ్యయంతో చెరువు సుందరీకరణ పనులు చేపట్టారు. ఇప్పటికే రూ.కోటితో కట్ట విస్తరణ, వాకింగ్ ట్రాక్ వంటి పనులు పూర్తి చేశారు. లోతట్టు ప్రాంతాలను వరదలు ముంచేయకుండా భారీ ట్రంక్ లైన్లు ఏర్పాటు చేశారు. రూ.50 లక్షలతో చేపట్టిన వాకింగ్ ట్రాక్ చుట్టూ కంచె నిర్మించారు. కట్టపై రహదారిలో గ్రిల్స్, ఫుట్ పాత్‌పై టైల్స్, బతుకమ్మ ఘాట్ వంటి పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయి. రూ.50 లక్షలతో మెయిన్ రోడ్డు వెంట ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, రూ.20 లక్షలతో ఓపెన్ జిమ్ పనులు చేపట్టనున్నారు.



పర్యాటకులతో సందడిగా మారిన చందన చెరువు



పచ్చదనం పరుచుకున్న గండిపేట్ జలాశయం పార్కు

బస్తీల్లోని ఇళ్లే టార్గెట్

- మద్యం మత్తులో వరుస చోరీలు
- రెండు రోజుల్లోనే 21 ఇళ్ల తాళాలు బ్రేక్
- ఆరింటిలో ఉన్న సొత్తు, వస్తువులు స్వాహా
- నలుగురిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ టీమ్



వివరాలు వెల్లడిస్తున్న అదనపు సీపీ (నేరాలు) శ్రీనివాస్

సాక్షి, సిటీబ్యూరో: కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని దయార్‌గూడ, కేరళబస్తీ, దేవీనగర్‌లలో గత నెల 23 తెల్లవారుజామున, ఎల్‌బీనగర్ ఠాణా పరిధిలోని చంద్రపురి కాలనీ, సూర్యోదయ కాలనీల్లో 25 తెల్లవారుజామున... మొత్తం 21 ఇళ్ల తాళాలు పగులకొట్టి, ఆరు ఇళ్లల్లో ఉన్న సొత్తు, వస్తువులు అపహరించిన సీరియల్ చోరులను మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వీటితో కలిపి వీళ్లు మొత్తం 23 కేసుల్లో వాంటెడ్‌గా ఉన్నారు. ఇద్దరితో పాటు ఇద్దరు రిసీవర్లను అరెస్టు చేసి, రూ.20 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నామని అదనపు సీపీ ఎ.ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావుతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

గతంలో 30 కేసులు.. 11 ఎన్‌బీడబ్ల్యూలు...

కర్ణాటకలోని హుబ్లీలో ఉన్న గాంధీవాడ ప్రాంతానికి చెందిన దార్ల నేహెమయ్య అలియాస్ బ్రూస్‌లీ కొన్నేళ్ల క్రితం నగరానికి వలసవచ్చి ఫతేనగర్‌లో స్థిరపడ్డాడు. తల్లి మరణం తర్వాత కుటుంబాన్ని వదిలేసి వచ్చిన ఇతగాడికి పబ్లిక్ గార్డెన్స్‌లో ఉండే పిక్ పాకెటింగ్ గ్యాంగ్‌లతో పరిచయం ఏర్పడింది. వారితో కలిసి చిన్నచిన్న నేరాలు చేయడం మొదలెట్టాడు. ఆపై హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండలతో పాటు ఏపీ, కర్ణాటకల్లోనూ ఇళ్లల్లో చోరీలు చేశాడు. ఇతడిపై ఇప్పటి వరకు 30 కేసులు నమోదు కాగా...కోర్టు విచారణకు హాజరుకాకపోవడంతో 11 నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యాయి. గత ఏడాది చోరీ కేసుల్లో హుబ్లీ, రాయచూర్, గుంతకల్లు పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. బెయిల్‌పై బయటకు వచ్చి తన పంథా కొనసాగించాడు. ఇతడు కొన్నాళ్లు ఏపీ, కర్ణాటకల్లో పని చేసి ఉండటంతో ఆ ప్రాంతాలకూ రాకపోకలు సాగించేవాడు.

మద్యం మత్తు... గంజాయి నిషా...

కర్ణాటక నుంచే వచ్చి ఫతేనగర్‌లో ఉంటున్న మందుల శంకర్‌తో నేహెమయ్యకు పరిచయం ఏర్పడింది. వీళ్లిద్దరూ కలిసి గతేడాది చందానగర్, అల్వాల్, నంద్యాల, అనంతపురం ప్రాంతాల్లోని ఇళ్లల్లో చోరీలు చేశారు. శంకర్‌పై గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదై ఉంది. రాత్రి వేళల్లో పూటుగా మద్యం తాగే ఈ ద్వయం ఆపై గంజాయి పీలుస్తుంది. ఆ స్థితిలో రాడ్లు, ఇతర వస్తువులు పట్టుకుని బస్తీల్లో రెక్కీ చేస్తుంది. తాళం వేసున్న ఇళ్లను గుర్తించి పంజా విసురుతుంది. ఇలానే గత నెలలో కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్‌లలో వరుస చోరీలు చేసింది. బంగారం, వెండి నగలు, ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు కొన్ని గిల్ట్ నగల్నీ ఎత్తుకుపోయింది. మొత్తమ్మీద వీళ్లు నగరంలోని మూడు కమిషనరేట్లతో పాటు ఏపీ, కర్ణాటకల్లో నమోదైన 23 కేసుల్లో వాంటెడ్‌గా ఉన్నారు. ఈ ద్వయం మహంకాళి ఠాణా పరిధిలోనూ ఓ చోరీ చేసింది. వీళ్లను పట్టుకోవడానికి మధ్య మండల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రఘునాథ్ నేతృత్వంలో ఎస్ఐ సి.హెచ్.నవీన్‌కుమార్ నత్వృత్వంలోని బృందం రంగంలోకి దిగింది. ముమ్మరంగా గాలించి వీరిద్దరితో పాటు చోరీ సొత్తు ఆధీనంలో ఉంచుకున్న రిసీవర్లు మనోజ్‌కుమార్ మాలిక్, నామల శ్రీధర్‌ను పట్టుకుంది.

ఘనంగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్ ప్రారంభం

టాస్ వేసి ప్రారంభించిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్, 'సాక్షి' సీజీఎం కమల్‌కిశోర్‌రెడ్డి

- క్రీడా స్ఫూర్తి అవసరం: సాక్షి సీజీఎం కమల్‌కిశోర్‌రెడ్డి
- ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు

ఘట్‌కేసర్: 'సాక్షి' యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్–4 (ఎస్పీఎల్) బుధవారం ఘనంగా ప్రారంభమైంది. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానం క్రీడా సంబురానికి వేదికైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 65 జట్లు ఎస్పీఎల్‌లో పాల్గొంటున్నాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన (సాట్స్) చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ టాస్ వేసి లీగ్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథి ఆంజనేయగౌడ్, 'సాక్షి' మీడియా గ్రూప్ సీజీఎం కమల్ కిశోర్‌రెడ్డి సరదాగా బ్యాటింగ్, బౌలింగ్ వేసి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. వారితో పాటు ఏజీఎం ఉగ్రగిరిరావు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం వెలికితీయడం అభినందనీయం...

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ... పుట్టుకతోనే ఎవరూ విజేతలు కాలేరని, చిత్తశుద్ధితో చేసే ప్రయత్నంతోనే విజయం వారికి సొంతం అవుతుందన్నారు. సాధారణ, రాజకీయ వార్తలే కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు 'సాక్షి' యాజమాన్యం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

- తొలి అండర్–19 మహిళల టీ20 వరల్డ్ కప్ విజేత జట్టు కీడాకారిణి భద్రాద్రికొత్తగూడెం జిల్లాకు చెందిన త్రిషను ఆదర్శంగా తీసుకొని ఉన్నతశిఖరాలకు చేరుకోవాలని సూచించారు.
- ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రతిభ గల గ్రామీణ క్రీడాకారులను 'సాక్షి' మీడియా ప్రోత్సహిస్తోందని ఆయన పేర్కొన్నారు. క్రీడలతో ఐక్యత భావం పెరుగుతుందని, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందన్నారు.
- సీజీఎం కమల్ కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ... గెలుపు ఓటములు సహజమని, క్రీడల్లో పాల్గొనడం గొప్ప విషయమన్నారు.
- కార్యక్రమంలో 'సాక్షి' ఏజీఎం ఉగ్రగిరిరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం–1

- మొదటి మ్యాచ్‌లో ఐఎంసీ ఖైరతాబాద్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 58 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన సైదాబాద్ మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 9.3 ఓవర్లలో 59 పరుగులు చేసి విజేతగా నిలిచింది.
- రెండవ మ్యాచ్‌లో మొఫ్కంజా కళాశాల జట్టు, ఇబ్రహీంపట్నం శ్రీదత్తా ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై గెలుపొందింది. మొఫ్కంజా క్రీడాకారుడు అఫాన్ 29 బంతుల్లో 51 పరుగులు చేశాడు. మూడవ మ్యాచ్‌లో శ్రేయ ఇంజినీరింగ్ కళాశాల–బి జట్టు, వైష్ణవి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల జట్టుపై గెలుపొందింది.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం–2

- మొదటి మ్యాచ్‌లో వేదా డిగ్రీ కళాశాల జట్టు, అంబేద్కర్ డిగ్రీ కళాశాల జట్టుపై అలవోకగా విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో వెస్లీ డిగ్రీ కళాశాల–ఎ జట్టు, శ్రేయ ఇంజినీరింగ్ కళాశాల జట్టు–ఏ పై గెలుపొందింది. మూడవ మ్యాచ్‌లో విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు, ప్రగతి డిగ్రీ జట్టు పోటీపడగా 10 ఓవర్లలో ఇరు జట్లు 108 పరుగులు చేయడంతో మ్యాచ్ టై అయింది. ఈ సందర్భంగా వేసిన సూపర్ ఓవర్ విజేతను వరించింది.
- సూపర్ ఓవర్‌లో మొదటి బ్యాటింగ్ చేసిన ప్రగతి జట్టు 6 బంతుల్లో 26 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన విజ్ఞాన్ జట్టు 22 పరుగులు చేసి ఓటమి చవిచూసింది.
- విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు క్రీడాకారుడు కలీం 56 పరుగులు చేయగా, ప్రగతి జట్టు క్రీడాకారుడు మోహన్ 46 వ్యక్తిగతంగా అత్యధికంగా పరుగులు చేశాడు.



ప్రగతి డిగ్రీ కళాశాల జట్టు సభ్యులు



వెస్లీ కళాశాల జట్టు



సందడి చేస్తున్న క్రికెటర్స్

బడ్జెట్‌పై భిన్న స్వరాలు..

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో దేశాన్ని ఆర్థికంగా బలపరిచేందుకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. కేంద్ర బడ్జెట్‌పై పలువురి భిన్నాభిప్రాయాలు ఇలా ఉన్నాయి. – సాక్షి, బృందం

చరిత్రలో నిలిచిపోతుంది



ఇతర దేశాలు ఆర్థిక సంక్షోభంతో బాధపడుతున్నాయి. కానీ మన దేశ ఆర్థిక పరిస్థితి మాత్రం స్థిరంగా ఉంది. బడుగు, బలహీన వర్గాలకు, యువతకు మేలు చేకూరే విధంగా బడ్జెట్ ఉంది. ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ కేటాయింపులు చేశారు. ఇది చరిత్రలో నిలిచిపోతుంది. బడ్జెట్‌లో రహదారులు, రైల్వేకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చింది. వ్యవసాయానికి, స్టార్టప్ కంపెనీలకు ఆశించిన దానికంటే ఎక్కువ కేటాయింపులు చేసింది. ఆదాయ పన్నులోనూ భారీగా మినహాయింపులు చేసింది.

– ఆకుల శ్రీవాణి, కార్పొరేటర్, సరూర్‌నగర్

బంగారం ధర తగ్గించాలి



నానాటికి బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. సామాన్య ప్రజానీకం బంగారం కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ప్రభుత్వం బంగారం ధరలను తగ్గించేలా చూడాలి.

– మమత, మంఖాల్

ప్రజాకర్షక బడ్జెట్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజాకర్షకంగా ఉంది. గత ప్రభుత్వాలకు భిన్నంగా బడ్జెట్‌ను రూపొందించింది. పేదలకు మేలు చేసే బడ్జెట్ ఇది. ప్రజలపై పన్నుల భారాన్ని తగ్గేంచేలా అనేక నిర్ణయాలు తీసుకుంది. రైతులు, పేద, మధ్య తరగతి ప్రజలపై అనేక వరాలు కురిపించింది. విద్యుత్ వాహనాలపై పన్ను రాయితీ తగ్గించింది. టీవీలు, సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లపై ఉన్న దిగుమతి సుంకాన్ని తగ్గించింది. మహిళలకు, తృణ ధాన్యాలు పండించే రైతులకు బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. తలసేమియా బాధితులకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించి అండగా నిలిచింది.

– బుక్క వేణుగోపాల్, బీజేపీ రాష్ట్ర నాయకుడు, శంషాబాద్

వేతన జీవులను వంచించారు



ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని స్వల్పంగా పెంచి మధ్య తరగతి వేతన జీవులకు భారీ ఊరట పేరుతో ప్రచారం చేసుకోవడం తగదు. పాత, కొత్త పన్ను విధానాలను కొనసాగిస్తూ క్రమంగా పాత పన్ను విధానాన్ని ఎత్తివేయడానికే ప్రభుత్వం యత్నిస్తున్నట్లు ఈ బడ్జెట్ ద్వారా స్పష్టమైంది. ఆదాయ పరిమితిని నామమాత్రంగా పెంచింది. కేంద్రం ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేస్తున్న వేతన జీవులను పూర్తిగా వంచించింది. 2014కు ముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీజేపీ డిమాండ్ చేసిన స్టాండర్డ్ డిడక్షన్ పెంపు విధానాన్ని అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అమలు చేయకపోవడం ఆందోళనకరం.

– గాలయ్య, రాష్ట్ర కార్యదర్శి, యూటీఎఫ్

ఆదాయ పన్ను విధానంలో మార్పుల హర్షం



వేతన జీవులకు ఆదాయ పన్ను చెల్లింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మార్పులు తీసుకురావడం హర్షణీయం. గతంలో రూ.నాలుగు లక్షల వరకు ఉన్న మినహాయింపు ఈ ప్రకటన ద్వారా రూ.7 లక్షలకు చేరుకుంది. ఇప్పటి ఈ విధానం ఎంతో మందికి ఉపయోగపడుతోంది.

– పి.రామచందర్ రాజు రిటైర్డ్ ఉపాధ్యాయులు

అన్ని వర్గాలకు ఆమోదయోగ్యం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందని బుధవారం బీజేపీ ఎస్సీమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ తెలిపారు. 2023–24 సంవత్సరానికి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ రూ.45 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగిందని వివరించారు. ముఖ్యంగా రైతులు, ఉద్యోగులు, మహిళలకు ప్రాధాన్యతను ఇస్తూ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారని తెలిపారు. ఇన్‌కం టాక్స్ కడుతున్న మధ్యతరగతి ప్రజలకు బడ్జెట్‌లో ఊరట లభించిందని పేర్కొన్నారు. వడ్డీలేని రుణాలకు నిధులను కేటాయించడం, ఉచిత రేషన్ బియ్యం పంపిణీ పొడగించడం హర్షనీయమని తెలిపారు.

– వెంకటేష్, బీజేపీ ఎస్సీమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు.

కొత్త పథకాలు లేవు



బడ్జెట్‌లో కొత్త పథకాలు పెద్దగా ఏమి లేవు. సేంద్రియ వ్యవసాయంపై పెట్టుబడులు, మహిళల కోసం మహిళా సమ్మాన్ పథకం గ్రామీణ ప్రాంతాల్లో బాగా పని చేస్తోంది. చిన్న వ్యాపారులు పాన్‌కార్డులు తీసుకోవాలనడం ఇబ్బందికరం. బడ్జెట్‌లో రాష్ట్రాల్లో పెట్టుబడుల మధ్య వ్యత్యాసం చూపించారు. ఉద్యోగులకు కేంద్ర బడ్జెట్ మంచి ఊరట కల్పిస్తోంది.

– డాక్టర్ ఎస్.రవీందర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, షాద్‌నగర్

మార్పుల హర్షం

వేతన జీవులకు ఆదాయ పన్ను చెల్లింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మార్పులు తీసుకురావడం హర్షణీయం. గతంలో రూ.నాలుగు లక్షల వరకు ఉన్న మినహాయింపు ఈ ప్రకటన ద్వారా రూ.7 లక్షలకు చేరుకుంది. ఇప్పటి ఈ విధానం ఎంతో మందికి ఉపయోగపడుతోంది.

– పి.రామచందర్ రాజు రిటైర్డ్ ఉపాధ్యాయులు

వేతన జీవులకు ఊరట



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులకు కొంత ఊరట కలిగించింది. ఆదాయపు పన్ను గురించి వేతన జీవులు రూ.10లక్షల వరకు పన్ను మినహాయింపు ఆశించారు. కానీ ప్రభుత్వం రూ.7 లక్షల వరకు మాత్రమే మినహాయింపు ఇచ్చింది. మధ్య తరగతి, అల్పాదాయ వర్గాలు ఆశించినట్లు పన్నులు తగ్గలేదు.

– వంగూరి గంగిరెడ్డి, సామాజిక వేత్త, విశ్రాంత ఉపాధ్యాయుడు, షాద్‌నగర్

ఇది ఎన్నికల బడ్జెట్!

దేశంలోని పలు రాష్ట్రాలలో రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్ రూపొందించిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుజ్జుల మహేశ్ అన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరుపేదల మేలు కోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్యను ప్రభుత్వం పరిష్కరించడం లేదని విమర్శించారు.

– గుజ్జుల మహేశ్

కంప్యూటర్ ఆపరేటర్ బలవన్మరణం



శ్రీనివాస్ మృతదేహం

కడ్తాల్: జీవితంపై విరక్తి చెందిన అవుట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆమనగల్లు పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. ఆమనగల్లు ఎస్ఐ సుందరయ్య తెలిపిన ప్రకారం.. పట్టణానికి చెందిన రచ్చ శ్రీనివాస్(32) కడ్తాల్ మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ అవుట్‌సోర్సింగ్ విభాగంలో అకౌంటెంట్ కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం విధులకు హాజరైన శ్రీనివాస్ మధ్యలో బయటికి వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం ఆమనగల్లు సమీపంలోని సురసముద్రం చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటికి తీసి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ప్రమీళమ్మ మృతదేహం

కడ్తాల్: హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఆమనగల్లు ఎస్ఐ సుందరయ్య తెలిపిన ప్రకారం.. వెల్దండ మండలం రాచూర్ గ్రామానికి చెందిన ప్రమీళమ్మ(45), బుధవారం తెల్లవారుజామున శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై, విఠాయిపల్లి సమీపంలో నడుచుకుంటూ వెళ్తోంది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు ప్రయాణిస్తున్న ఆటో ఆమెను వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆమె ఘటనాస్థలిలోనే మృతి చెందింది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

రెండు బైకులు ఢీ.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

మొయినాబాద్: ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొనడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని రెడ్డిపల్లి సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై లింగ్యానాయక్ తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని లంగర్‌హౌస్, బాపునగర్‌కు చెందిన దయానంద్(44) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. కాగా శంకర్‌పల్లి సమీపంలోని తన పొలం వద్దకు మంగళవారం సాయంత్రం బైక్‌పై వెళ్లాడు. రాత్రి తిరుగుప్రయాణంలో రెడ్డిపల్లి గ్రామానికి చెందిన దేవరంపల్లి మధు బైక్‌పై శంకర్‌పల్లి వైపు ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో రెడ్డిపల్లి సమీపంలో ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్నాయి. దీంతో తలకు తీవ్ర గాయాలైన దయానంద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది

కబ్జాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు

ఆర్ఐలు కృష్ణ, పుష్పలత



కడీలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు చూస్తే సహించేది లేదని ఇబ్రహీంపట్నం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు గౌర కృష్ణ, పుష్పలత హెచ్చరించారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్ సర్వే నెంబరు 11లో అక్రమార్కులు 400 గజాల స్థలాన్ని కబ్జా చేసేందుకు కడీలు పాతారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు సమాచారం అందడంతో బుధవారం సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆర్ఐలు కృష్ణ, పుష్పలత వెళ్లి హద్దు రాళ్లను తొలగించారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు .

చిన్నారిని చితకబాదిన టీచర్



టీచర్ కొట్టడంతో వచ్చిన వాతలు



అభినయశ్రీ

చేవెళ్ల: హోం వర్కు చేయలేదని 2వ తరగతి విద్యార్థినిని ఓ ఉపాధ్యాయురాలు వాతలు వచ్చేలా చితకబాదింది. ఈ ఘటన బుధవారం మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో చోటు చేసుకుంది. చిన్నారి తల్లిదండ్రులు తెలిపిన ప్రకారం.. మండలంలోని రామన్నగూడ గ్రామానికి చెందిన సీహెచ్.ప్రభాకర్ కూతురు అభినయశ్రీ మండలకేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. అనారోగ్యంగా ఉండడంతో అభినయశ్రీ 15రోజులుగా పాఠశాలకు వెళ్లలేదు. ఈ క్రమంలో ఉపాధ్యాయురాలు సోని ఈ విషయం తెలియక విద్యార్థిని హోంవర్కు చేయకుండా ఎక్కువరోజులు పాఠశాలకు హాజరవ్వలేదనే కారణంతో చేతిపై వాతలు వచ్చేలా కర్రతో దండించింది. సాయంత్రం బస్సులో ఇంటికి వెళ్లే సమయంలో అభినయశ్రీ ఆమె అక్కలు చైతన్యశ్రీ, చరణ్యశ్రీకి చెప్పడంతో వారు తల్లిదండ్రులకు వివరించారు. తల్లిదండ్రులు గమనించి ఉపాధ్యాయుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫోన్‌లో పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్ రాంరెడ్డి పొరపాటు జరిగిందని ఆ ఉపాధ్యాయురాలిని మందలించామని సమాధానం ఇచ్చారని చెప్పారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఉపాధ్యాయురాలిపై కేసు పెడుతానని చిన్నారి తండ్రి ప్రభాకర్ చెప్పారు.